

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## మీరైతే ఏం చేస్తారు?

**లిఫ్ట్** దిగి కారిడార్లో నడిచి, మలుపు తిరిగాడు మహేంద్ర. ఫ్లాట్ తలుపు తీసే ఉంది. ఎదుటి ఫ్లాట్ తలుపు కూడా తీసే ఉంది. ఆ ఇంట్లోంచి పెద్దగా మాటలు వినబడుతున్నాయి.

"నిజం నాన్నా. మా గేంగ్ అంతా కలిసి వెళ్ళాం. మేమిద్దరమే వెళ్ళలేదు" పదిహేనేళ్ళ చిన్నీ వెక్కిళ్ళ మధ్య చెప్తోంది.

మహేంద్రని చూడగానే చిన్ని మొహం వికసించింది.

"అంకుల్ వచ్చారుగా అడగండి కావాలంటే.. మహీ అంకుల్ సినిమాకి మా గేంగ్ అందరమూ వచ్చాం కదా?" అడిగింది.

"అది అతనికెలా తెలుస్తుంది?" చిన్నీ తండ్రి అసహనంగా అడిగాడు.

"అంకుల్ కూడా అదే సినిమాకి వచ్చారు. ఎవరో అక్క, అంకుల్ బాగా ముందు లైన్లో కూర్చున్నారు. అక్కడికి స్క్రీన్ ఎంత పెద్దగా కనిపిస్తుందో" చిన్ని చెప్పుకుపోతోంది.

అకస్మాత్తుగా అక్కడ ఇబ్బందికర వాతావరణం నెలకొంది

అక్కడే సోఫాలో కూర్చుని సర్ది చెప్పడానికి ప్రయత్నిస్తున్న చందన లేచి తమ ఫ్లాట్లోకి వెళ్ళిపోయింది. మహేంద్ర ఆమె వెనకే వెళ్ళి తలుపు మూసాడు.

చందన పడకగదిలోకి వెళ్ళిపోయింది. మహేంద్ర నిస్పృహాయంగా హాల్లో కూర్చున్నాడు. అతనికి ఏం చేయాలో తోచడంలేదు.

కావేరి అలా మాట్లాడిందేమిటి? ఇప్పుడు తనేం చేయాలి?

ఉదయం ఆఫీస్ కి వెళ్ళిన గంటకే కావేరి ఫోన్ చేసింది.

"అర్జెంట్‌గా మాట్లాడాలి" చెప్పింది.

"సాయంత్రం కలుద్దాం" చెప్పాడు.

"లేదు. అర్జెంట్‌గా మాట్లాడాలి. ప్లీజ్. హాఫ్ డే లీవ్ తీసుకోవచ్చా?" అర్థించింది.

మహేంద్ర మెత్తబడ్డాడు.

"సరే. ఎక్కడ కలుద్దాం? ఏదైనా రెస్టారెంట్‌కి వెళదామా?" అడిగాడు.

"వద్దు. తెలిసిన వాళ్ళు చూస్తే కష్టటం" నిరాకరించింది.

"ఇందిరా పార్క్?"

కిలకిల నవ్వింది.

"మిట్టమధ్యాహ్నం పార్కా?"

"మరి ఎక్కడికో నువ్వే చెప్పు."

"సినిమాకెళ్దాం. ఐ మేక్స్‌లో."

"సినిమా కోసం లీవ్ పెట్టమంటావా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"లేదు. సినిమాకైతే ఎవరూ రారని."

"రెస్టారెంట్‌కి వచ్చిన వాళ్ళు సినిమా హాల్‌కి రారా?"

"తిని వెళ్ళిపోతారు. సినిమా హాల్లో రెండుగంటలు కూర్చోవాలిగా? పనులు?"

"సరే. సరే. ఎక్కడికి రావాలో చెప్పు."

"ప్రసాద్స్‌కి. ముందు మెట్ల మీద వెయిట్ చేస్తుంటా. తప్పకుండా రావాలి" ఫోన్ పెట్టేసింది.

మహేంద్ర హాఫ్‌డే లీవ్ తీసుకుంటున్నానని మేనేజర్‌కి చెప్పి, మధ్యాహ్నం దాకా పనిచేసి ఒకటిన్నరకి ఐ మేక్స్‌కి చేరుకున్నాడు.

కావేరి విస్ఫారిత మొహంతో ఎదురు వచ్చి చెప్పింది.

"టిక్కెట్స్ తీసుకున్నా"

అది ఎన్కాంటో మూవీ.

"ఇదేంటీ డిస్నీ మూవీకి తీసుకొచ్చావ్?'

"దీనికైతే తెలిసినవాళ్ళు ఎవరూ రారని. మనమెటూ మూవీ చూడటం లేదుగా?" నవ్వింది.

సినిమా ప్రారంభమై లైటార్పేసాక అతని చేతిని తన చేతిలోకి తీసుకుని చెప్పింది.

"మనం పెళ్ళి చేసుకుందాం మహీ."

"పెళ్ళా?" మహేంద్ర తెల్లబోయాడు.

"అవును ఇప్పటికే లేటైంది" కావేరి సిగ్గుగా చెప్పింది.

"కానీ నాకు పెళ్ళయిందిగా?" గొణిగాడు.

"తెలుసు. విడాకుల ప్రాసెస్ అంతా పూర్తవడానికి ఏడాది పట్టదూ? మ్యూచువల్ కంసెంట్ అయితే ఆర్నెల్లలో వస్తాయట. ఎప్పుడు స్టార్ట్ చేస్తున్నావు?"

"విడాకులా?" నివ్వెరపోయాడు.

"అవును. తను మంచిది కాదనేగా నాకు దగ్గరయ్యావ్?" నవ్వింది.

"మంచిది కాదా? నీకెప్పుడు చెప్పాను?"

"మరి ఆవిడ స్ట్రిక్ట్, రాక్షసి ఇలా చెప్పావు కదా?"

"అంటే విడాకులిస్తాననా?"

"మరి ఇవ్వకుండా రెండో పెళ్ళి చేసుకోవచ్చా?"

"జైల్లో పెడతారు."

"మరి విడాకులు ఇచ్చే ఉద్దేశం లేకపోతే నన్నెందుకు ఫ్లర్ట్ చేసావ్?"

మహేంద్ర నీళ్ళు నమిలాడు.

కావేరి అతని చెయ్యి పట్టుకుని కుదుపుతూ అడిగింది.

"అంటే పెళ్ళి చేసుకోవా?"

మహేంద్ర మాట్లాడలేదు.

"మరి ముద్దులు, హగ్స్... నేనేమనుకుంటున్నావ్?" ఆవేశంగా అరిచింది.

"ష్. నెమ్మదిగా."

"నువ్వు మీ ఆవిడ మీద జోక్స్ వేస్తూ, తిడుతూంటే ఆవిడకి విడాకులిస్తావనుకున్నాను. నాతో చనువుగా ఉంటే నన్ను పెళ్ళి చేసుకుంటావనుకున్నాను" కావేరి ఏడుపు గొంతుతో చెప్పింది.

"నీకు ముప్పై. నాకు ముప్పై తొమ్మిది. నువ్వు చాలా చిన్నదానివి."

"ముద్దు పెట్టుకునేప్పుడు నా వయసు గుర్తులేదా?" ఉక్రోషంగా అడిగింది.

"కావేరీ ప్లీజ్."

"నువ్వు అంత వయసున్నవాడిలా కనిపించవు. అందుకే రెండో పెళ్ళయినా ఒప్పుకున్నాను" గోముగా చెప్పింది.

"రెండో పెళ్ళేంటి తల్లీ? నేనెప్పుడైనా పెళ్ళి ప్రసక్తి తెచ్చానా?" విసుగ్గా అడిగాడు.

"అందుకేగా నేను చొరవ తీసుకుంది? వచ్చేనెల నా బర్త్‌డే ముప్పై ఒక్కేళ్ళు వస్తాయి. అమ్మా నాన్న సంబంధాలు చూస్తున్నారు. ఇంక లాభం లేదని నేనే అడుగుతున్నా" చెప్పింది.

"నాకు కొంత టైం కావాలి కావేరీ" అప్పటి ఆ సమస్యలోంచి బయటపడడానికి చెప్పాడు.

"సరే. ఇవాళ గురువారం. శనివారం కలుద్దాం. వెనక్కి వెళ్తే ఊరుకోను. నీతో అన్ని అనుభవాలు పొంది, ఇంకో అమాయకుడికి భార్యగా వెళ్ళలేను" గద్గద స్వరంతో చెప్పింది.

"అన్ని అనుభవాలా? బాబోయ్. ఏం మాట్లాడుతున్నావు?" అదిరిపడి అడిగాడు.

"అంటే అదొక్కటే శృంగారం కాదు మహీ. ముద్దులు, హగ్స్ కూడా రొమాన్సే."

మహేంద్రకి టపటపా చెంపలు వాయించుకోవాలనిపించింది. హఠాత్తుగా కావేరి విఠలాచార్య సినిమాలో రాకుమారి శాపవశాత్తూ గుండెలు బాదుకునే ఎలుగుబంటిలా మారినట్లు అనిపించింది.

"శనివారం ఎప్పట్లాగా నా ఫ్రెండ్ ఇంట్లో కలుద్దాం" చెప్పి కావేరి లేచి వెళ్ళిపోయింది.

మహేంద్ర కుర్చీలో వెనక్కి ఆనుకుని కళ్ళు మూసుకున్నాడు. అతను ఊహించని ఈ పరిణామాన్ని ఎలా ఎదుర్కోవాలీ? అర్థంకాలేదు. అతను ఆలోచనా శక్తి కోల్పోయాడు. ముందు సినిమా కాని, వెనక పిల్లలు అల్లరి కాని అతన్ని

తాకలేదు. సినిమా పూర్తయి లైట్స్ వెలిగి, తలుపులు తీసాక భారంగా లేచి బయటకి వచ్చేసాడు. చిన్నిని కాని, ఆమె స్నేహితులని కాని చూడలేదు.

ఎవరూ చూడరు అని కావేరి సినిమాకి తీసుకెళితే ఎదురింటి పిల్లే చూసింది. జరగాల్సిన అనర్థం జరిగిపోయింది.

లైట్ వెలిగింది. కళ్ళు తెరిచి చూసాడు. చందన దణ్ణం పెట్టుకుంటోంది. తర్వాత నేప్కిన్ తీసుకుని వంగి టీపాయ్ తుడవసాగింది.

ఆమెకి టెన్షన్, లేదా మానసిక బాధకలిగితే ఇల్లు శుభ్రం చేస్తుందని మహేంద్రకి తెలుసు.

"సారీ" గొణిగాడు.

"ఎవరా అమ్మాయి?" చందన టీపాయ్‌ని బలంగా తుడుస్తూ అడిగింది.

"కావేరి."

"పేరు బాగుంది. ఎలా పరిచయం?"

"నా ఫ్రెండ్ బాలాజీ కజిన్."

"కలిసి సినిమా కెళ్ళేంత క్లోజా?"

మహేంద్ర మాట్లాడలేదు.

చందన కిటికీ గ్రిల్‌ని తుడుస్తోందిప్పుడు.

"మహేంద్ర లేచి ఆమె పాదాల దగ్గర కూర్చుని ఆమె చీరలో తలదాచుకున్నాడు.

చందన తుడవడం ఆపి అతన్ని లేపి సోఫాలో కూర్చోపెట్టి పక్కన కూర్చుంది.

మహేంద్ర ఆమె ఒళ్ళో తల పెట్టి పడుకున్నాడు. అతని కళ్ళవెంట కారే కన్నీటి స్పర్శ ఆమెకి తెలుస్తోంది. నిశ్శబ్దంగా కూర్చుంది.

"బాలాజీ పిన్ని కూతురు. తెలివిగలమ్మాయి. జాబ్ చేయదు. సివిల్స్ ప్రిపరేషన్ అని చదువుతుండేది. బాలాజీ ఇంటికెళ్ళినప్పుడు అప్పుడప్పుడూ కలిసేది. ప్రతి విషయం మీద అథారిటీ ఉంది. ఏ టాపిక్ అయినా అనర్గళంగా మాట్లాడేది. తన ఫ్రెండ్ కూడా సివిల్స్‌కి చదివేది. ఇంట్లో ఉంటే డిస్టర్బెన్స్ అని ఆ అమ్మాయి ఓ అపార్ట్‌మెంట్ అద్దెకి తీసుకుని అందులో ఉండి చదువుకునేది. బాలాజీ ఇంట్లో కలవడం తనకి నచ్చట్లేదని, ఫ్రెండ్ ఇంట్లో ఫ్రీగా మాట్లాడుకోవచ్చని కావేరి నన్ను అక్కడికి రమ్మంది. అప్పుడప్పుడూ వెళ్ళేవాడ్ని. మూడుసార్లు రాసినా తను ప్రిలిమ్స్‌లో కూడా క్వాలిఫై అవలేదు. ఇంక ఆ ఆలోచన మానేసి జాబ్ వెదుక్కుంటానని, పేరెంట్స్ పెళ్ళి చేసుకోమంటున్నారని పదిరోజులుగా చెప్తోంది."

చందన ఎడమ చెయ్యి ఆమె పైట చెంగుతో సోఫాని తుడుస్తోంది.

"ఇవాళ సినిమాకి రమ్మని పిలిచింది. వెళ్తే పెళ్ళి చేసుకొమ్మని.." మహేంద్ర సిగ్గుతో మాట్లాడడం ఆపేసాడు.

"నువ్వేమన్నావు?"

బేలగా చూసాడు.

"ఎంత చెప్పినా వినడంలేదు. 'అన్నీ నీతో అయ్యాక ఇంకో అమాయకుడ్ని ఎలా చేసుకుంటాను' అంది."

చందన అతని తలని పక్కకి నెట్టేసింది.

"ప్లీజ్! నన్ను నమ్ము. నాలుగైదు సార్లు ముద్దుపెట్టుకున్నానేమో! అంతే" ప్రాధేయ పూర్వకంగా చెప్పాడు.

"పెళ్ళయినవాడివి ఆ పని ఎందుకు చేసావు?"

"బుద్ది గడ్డితిని. చాలా?" అసహాయత వల్ల వచ్చిన కోపంతో అరిచాడు.

"పరుల కొసగలేదె ఉవిద నీ అధరమ్ము
నాకు కూడ నోరు లేక పోలేదు" రాగం తీసింది.

"ఇక్కడ జీవన్మరణ సమస్య" మళ్ళీఅరిచాడు.

"సరే, ఏం నిర్ణయం తీసుకున్నావ్?"

"నిర్ణయం ఏమిటి బుద్దిలేకుండా"

"ఎవరికి?"

"నాకే. సరేనా? ఏం చేయాలో చెప్పు."

"ముందు గొంతు తగ్గించు. ఎంతకాలంగా సాగుతుందో కాని ఈ కథలో నేను కనీసం గెస్ట్ ఆర్టిస్ట్‌ని కూడా కాదు. ఇప్పుడు నన్ను సొల్యూషన్ అడుగుతావేంటి? ఆ అమ్మాయిని ఏం చేద్దామనుకుని ముద్దు పెట్టుకున్నావ్?"

"నువ్వా అదే మాట" కస్సుమన్నాడు.

"ఇంకో మాట ఉందా? లోకజ్ఞానం తప్ప వ్యవహార జ్ఞానం లేని పిల్లని ఏకాంతంగా కలిసి, ముద్దులు పెట్టేసుకుంటే మరి ఆ పిల్ల పెళ్ళిచేసుకోమనదా?"

"ఈ కాలంలో కూడా.."

"ఈ కాలం, ఆ కాలం అని ఉండదు మహీ. కాలం ఎప్పుడూ ఒకటే. ఎండా కాలం ఎండ కాస్తుంది. వర్షాకాలం వాన కురుస్తుంది.. తన పని తను చేసుకుంటుంది. నీలాంటివాళ్ళే ' ఈ కాలంలో ముద్దు పెట్టుకున్నంత మాత్రాన పెళ్ళి చేసుకోవాలా?' అంటారు. ఏ కాలమైనా గాలి పీల్చుకునే బతుకుతాం. అలాగే విలువలు కూడా మారవు. వారి సంఖ్యలో హెచ్చు తగ్గులు ఉండచ్చు కాని అందర్నీ నీకు అనుకూలమైన భాష్యంతో చూడకు. కావేరి విలువలున్న అమ్మాయే పాపం. పెళ్ళి చేసుకోమంటోంది. నీలా తుడిచేసుకోకుండా."

"నీకు విడాకులు కూడా ఇవ్వమంది" మళ్ళీ అరిచాడు.

"మరి ఈ కాలంలో విడాకులిచ్చేగా పెళ్ళి చేసుకోవాలి?" నవ్వింది.

"నవ్వితే చంపుతా."

"సరే. నాకెందుకు. నువ్వే ఆలోచించు ఏం చేయాలో. నేను వంట చేస్తా" చందన లేవబోయింది.

"చందూ. ప్లీజ్. బీ సీరియస్. ఏం చేయాలో చెప్పు." అర్థించాడు.

"నువ్వు వద్దు అనుకుంటే, నీ డబ్బు కూడా వద్దు మహీ. అలీమనీ అడగను. కోర్ట్‌కి వెళ్ళను. ఇంట్లోనే కాగితాల మీద సంతకం పెట్టేస్తా. సరేనా? ఇంతకంటే సహాయం చేయలేను" గంభీరంగా చెప్పింది.

"ఇడియట్‌లా మాట్లాడక. నీకు విడాకులిస్తానన్నానా?" అరిచాడు.

"ఇంక నీ ఇష్టం ఎక్కడుంది మహీ? ఇప్పుడు నీకు స్వంత నిర్ణయం తీసుకునే స్వతంత్రం ఉందా?" సూటిగా అడిగింది.

"అందుకే కదా నిన్ను ఆలోచించమంటున్నాను."

"ఐయాం సారీ. ఆ అమ్మాయి వాదనా కరెక్టే. ఇంకో అమాయకుడి జీవితంలోకి కన్యలా ఎలా వెళ్తుంది?"

"ఏమ్మాట్లాడుతున్నావు? ముద్దులకే కన్యత్వం పోయిందా?"

"కన్యత్వం మానసికం మహీ. నువ్వు ముద్దు పెట్టుకునే సమయంలో పాపం ఏం ఆలోచించిందో, ఆలోచనల్లో ఎంత దూరం వెళ్ళిందో? నాకేమీ తట్టడం లేదు సారీ. ఒకటి మాత్రం నిజం. ఇద్దరం కలిసి 'ఆరనీకుమా ఈ దీపం' అని పాడే ప్రసక్తి లేదు. నువ్వే ఎవరో ఒకర్ని ఎంపిక చేసుకో" చందన వంటగదిలోకి వెళ్ళిపోయింది.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments